# నువ్వు లేకపోయాక...

బాలగోపాల్ దేహభారాన్ని వదలి ఏకాంత విశ్రాంతి మందిరానికి వెళ్లిపోయారు. దేహం నుంచి విముక్తి లభించడం ఒక గొప్ప వరం. గడ్డ కట్టుకుపోయినా తెలుగు ఆలోచనా ప్రపంచంలో ఆయన పడిన యాతనను అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. దేవుడున్నాడు, లేడు వంటి వైరుధ్యాలను సృజనాత్మకంగా పరిష్కరించే వారికి తెలుగు సమాజంలో దేహవైరాగ్యం వచ్చితీరుతుంది. అలాంటి విరాగులను వదిలేసి ఆయనొక్కడే చెప్పా పెట్టకుండా వెళ్లిపోవడమే బాధగా ఉంది. ఆరోగ్యం గురించి కొత్త జాగ్రత్తగా వ్యవహరించవచ్చు కదా అనేవారికి అలాంటి వారి వైరాగ్యస్థితి అర్థమయ్యేదికాదు. అంతరంగం ఉన్నంత చురుగ్గా, పదునుగా శరీరం ఉండకపోవడం అనుభవంలోకి వస్తూ ఉంటుంది. బాలగోపాల్‌లాంటివారికి ఈ రెండు జోడుగుర్రాల్లా పరుగెత్తాల్సిన అవసరం కూడా ఉంటుంది. ఆత్మవికాసం జరుగుతున్న కొద్దీ శరీరంలో చురుకుదనం కొరవడుతూ పోవడం ఆయనకు అనుభవంలోకి వచ్చి ఉంటుంది. ఈ యాతనను భరించడం కన్నా దేహాన్ని తన మానానికి తనను ఆయన వదిలేసి ఉండవచ్చు. బాలగోపాల్ ఒక చారిత్రక సందర్భంలో తన కర్తవ్యాన్ని అందరి కన్నా గొప్పగా నెరవేర్చారు. ఆచరణకు, వ్యక్తిగత జీవితానికి మధ్య ఆయన అభేదాన్ని పాటించారు. తాను చెబుతున్న విలువలను ఆయన జీవితంలో పాటించారు. అటువంటి అవసరమే ఇప్పుడు తెలుగు సమాజానికి ఎక్కువగా ఉందనే విషయం తెలిసీ ఆయన వెళ్లిపోవడమే బాధాకరం. ఆయన తన అనుభవాల నేపథ్యం నుంచి, కార్యాచరణనుంచి ప్రజా ఉద్యమాలను ప్రేమపూరితంగానే ప్రశ్నించారు. ఆ ప్రేమను కూడా భరించలేని

స్థితికి తెలుగు మేధాప్రపంచం చేరుకోవడమే పెద్ద విషాదం. విప్లవోద్యమ సైద్ధాంతిక విశ్వాసాలపై బహుశా బాలగోపాల్‌కు విభేదాలు ఉండకపోవచ్చు. మానవ ప్రవర్తనను సంసిద్ధం చేయాల్సిన అవసరం గురించి ఆయన చెప్పిన విషయాలను పట్టించుకోవాల్సిన అవసరం ఉందని గుర్తించని సమాజంలో తలకిందుల విలువలు గజ్జె కట్టి ఆడుతాయి. పౌర హక్కులకు ఊపిరి, ఆదర్శంగా నిలిచిన ఆయన బాహ్య ప్రపంచం బెదిరింపులకు ఏ రోజూ లొంగకపోవడం ఆయన జీవితాచరణలోని నిమగ్నతను తెలియజేస్తుంది. అయితే, ఆయన దానిలోకే ఆగిపోవడమే సమాజానికి పెద్ద కంటగింపుగా మారింది. కొత్త ఆలోచనలను, ఆవిష్కరణలను ముందు పెట్టిన సృజనశీలురను ప్రపంచం ఏనాడూ సహించలేదు. తన ఆచరణ నుంచి విప్లవోద్యమానికి కొత్త ఆలోచనలను అందించడానికి చేసిన ప్రయత్నాన్ని కూడా హర్షించలేకపోయారు. అటు పాలకవర్గాలకు, ఇటు ప్రజా ఉద్యమాలకు ఆయన కొరకరాని కొయ్యగా మారారనే చెప్పాలి. అందుకే ఆయనపై నిర్దయంగా విమర్శనాదాదులు జరిగాయి. బాలగోపాల్ జీవితంలో ఏనాడూ రాజీపడడానికి ఇష్టపడలేదు. అందుకే ఆయన అంత పదునుగా, అంత కొత్తగా ఆలోచనలను మన ముందు పెట్టగలిగారు. ఆంధ్రదేశంలోనే కాదు, భారతదేశంలోనే పౌర సమాజం పూర్తిగా రూపుదిద్దుకోలేదని గుర్తించారు. కాబట్టే ఆయన మానవ హక్కుల వేదికను ఏర్పాటు చేసి ఉంటారు. పౌర సమాజానికి దూరంగా ఉన్న సెక్షన్లను గుర్తించి వారి కోసం తపన పడుతూ వచ్చారు.

ఈ విషయంలో తన ఆలోచనలను పంచడమే కాకుండా వాటిని ఆచరింపజేయడానికి ఆయన కార్యరంగంలో పనిచేశారు. అందుకే ఆయన ఆదివాసీలను, ముస్లిం మైనారిటీలను, తెలంగాణవాళ్లను విడివిడిగా గుర్తిస్తూ వారికి జరుగుతున్న అన్యాయంపై గళాన్ని, కలాన్ని వాడుతూ వచ్చారు. దీన్ని ఏకోన్ముఖంగా నడుస్తున్న తమకు ఆటంకమనే అభిప్రాయంతోనే ప్రజా ఉద్యమాలు చూశాయి. విప్లవోద్యమం సాయుధ పోరాటాన్ని మాత్రమే ఎంచుకుని పాలకవర్గాల తప్పుడు విధానాలను ఎదిరించడానికి రాజకీయ ఎజెండాను స్వీకరించలేక పోయారని గుర్తించిన విషయాన్ని ఎవరైనా అర్థం చేసుకున్నారో లేదో తెలియదు. ఆయన విప్లవోద్యమ కార్యాచరణను ప్రశ్నించడానికి చాలా సమయమే తీసుకున్నారు. తనలో నలుగుతూ,

తన అంతరంగాన్ని కల్లోలపరుస్తూ వచ్చినా ఆయన ప్రశ్నలు వేయడానికి ఈ సమయం తీసుకోవడమే విప్లవోద్యమాల పట్ల ఆయనకున్న సానుకూల వైఖరిని తెలియజేస్తుంది. ఈ సానుకూల వైఖరితో వచ్చే ప్రశ్నలను స్వీకరించే స్థితిలో లేకపోవడమే ఇప్పుడు పీడిత ప్రజలకు జరుగుతున్న నష్టం. విప్లవోద్యమంపై రాసిన వ్యాసాలు, గ్రంథాలు, విప్లవోద్యమంపై రాసిన వ్యాసాలకు సంపాదకత్వం వహించిన గ్రంథాలు ఆచరణలో కాస్తంత సృజనాత్మకతకు, మానవీయ కోణానికి వీలు కల్పించాలని చెప్పడానికే. ఆచరణ ఉద్యమాలను స్తంభింపజేయకూడదనే ఉద్దేశంతోనే ఆయన విమర్శలు చేసి ఉంటారు. రాజ్య హింసతో పాటు ప్రైవేట్ హింసను కూడా ఆయన వ్యతిరేకించడానికి బహుశా కారణం ఇదే. రాజ్యహింస అత్యంత దారుణంగానూ అన్యాయంగానూ, అమానవీయంగానూ ఉంటుందనే విషయం తెలియంది కాదు. కానీ ప్రజల కోసం పనిచేసే వారు ఈ విషయంలో రాజ్యంతో పోటీ పడాలనుకోవడమే పెద్ద అవరోధమనే విషయం బాలగోపాల్ భావించి ఉండవచ్చు. అదే సమయంలో రాజ్యహింసను వ్యతిరేకించడానికి ఆయన ఏనాడూ వెనకాడలేదు. రాజ్యహింసకు గల మూలాలను, దాని దౌష్ట్యాన్ని ఆయన ఎప్పటికప్పుడు వలువలు వలిచి బయట పెడుతూనే వచ్చారు. విభేదిస్తూనే ప్రజా ఉద్యమాల పట్ల సానుకూల వైఖరి ప్రదర్శించే మేధావి వర్గాన్ని సహించక పోవడం. ఉద్యమాలకు భావాత్మకంగా కట్టుబడి ఉంటే చాలు. వ్యక్తిగత ఆచరణ అవసరం లేదనే వైఖరి ఇప్పుడు రాజ్యమేలుతున్నది. ఇటువంటి సందర్భంలో మరో బాలగోపాల్ మనకు దొరుకుతాడా? అటువంటి 'మానవుడు' మరొకరు ఉండాలని కోరుకోవడం అత్యాశే అవుతుంది. అందుకే బాలగోపాల్ మరి కొన్నాళ్లయినా తన కోసం కాకున్నా మన కోసం జీవించి ఉండాల్సింది. నువ్వు లేకపోయాక మానవ మనుగడకు అర్థం చెప్పేవారెవరు?

**– కాసుల ప్రతాప రెడ్డి**

*12 అక్టోబర్ 2009, 'ఆంధ్రప్రభ' దినపత్రిక*